ప్రశ్నించడం కోసం...?

RNI NO. TELTEL/2023/90455

# మన ప్రజాప్రతినిధి

తెలుగు దిన పత్రిక

ప్రజా ప్రతినిధి NEWS టీ.వి

ఎడిటర్: జి. శ్రీనివాస్ సంపటి : 3 సంచిక :144 శుక్రవారం మార్చి 20 2026, పేజీలు - 4 వెల : 2/-

epaper.manaprajaprathinidhi.com

PUBLISHED FROM: TELANGANA /ANDHRAPRADESH

## ప్లేట్‌లోని విషం... 'కల్తీ ఆహారం'

**-లాభాపేక్ష కోసం సామాన్యుల ప్రాణాలతో చెలగాటం**
**-హైదరాబాద్‌లో వెలుగుచూసిన భారీ కల్తీ పనీర్ మరియు పాల ఉత్పత్తుల రాకెట్**
**-పండుగల వేళ ఆహార నాణ్యతను గుర్తించడంలో వినియోగదారుల అప్రమత్తత**
**-కట్టుదిట్టమైన నిఘా, కఠిన చట్టాల అవశ్యకతపై ప్రత్యేక విశ్లేషణ**



మార్చి 19 (మనప్రజాప్రతినిధి): భాగ్యనగరంలో నిత్యం ఏదో ఒక చోట వెలుగుచూస్తున్న కల్తీ ఆహారపు ఉదంతాలు సామాన్య ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. నిన్నగాక మొన్న సికింద్రాబాద్ గంజ్ బజార్ పరిసరాల్లో టాస్క్ ఫోర్స్ పోలీసులు మరియు ఆహార భద్రతా అధికారులు జరిపిన మెరుపు దాడుల్లో దాదాపు 3.9 టన్నుల కల్తీ పనీర్ మరియు ఇతర పాల ఉత్పత్తులు పట్టుబడటం సంచలనం సృష్టించింది. కేవలం అధిక లాభాల కోసం గుర్తు తెలియని వ్యక్తుల నుండి తక్కువ ధరకు నాసిరకం పనీర్, ఖోవా, కల్తీ నెయ్యిని సేకరించి, వాటిని హోటళ్లు, కేటరింగ్ సర్వీసులకు విక్రయిస్తున్న ఈ ముఠాల ఆగడాలు మితిమీరిపోతున్నాయి. ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెట్టి సాగుతున్న ఈ అక్రమ వ్యాపారంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. పనీర్ అనేది నేడు ప్రతి శుభకార్యంలోనూ, రెస్టారెంట్ మెనూలోనూ విడదీయలేని భాగంగా మారింది. అయితే మనం రుచిగా ఆరగిస్తున్న ఈ పనీర్‌లో యూరియా, డిటర్జెంట్, సల్ఫ్యూరిక్ యాసిడ్ మరియు నాసిరకం పామాయిల్ వంటి ప్రమాదకర రసాయనాలు కలుపుతున్నట్లు విచారణలో తేలింది. ఇలాంటి కల్తీ ఆహారం తీసుకోవడం వల్ల తక్షణమే వాంతులు, విరేచనాలు వంటి సమస్యలు రావడమే కాకుండా, దీర్ఘకాలంలో కిడ్నీలు దెబ్బతినడం, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులపై ఈ ప్రభావం మరింత తీవ్రంగా ఉంటోంది.పండుగల సీజన్ వచ్చిందంటే చాలు కల్తీ రాయుళ్లు తమ పనిని వేగవంతం చేస్తారు. ఉగాది, రంజాన్ వంటి పండుగల వేళ పాల ఉత్పత్తులకు డిమాండ్ పెరగడాన్ని వీరు ఆసరాగా చేసుకుంటారు. పనీర్ అసలైనదా లేక కల్తీదా అని గుర్తించడం సామాన్యులకు కష్టమైనప్పటికీ, కొన్ని చిన్న జాగ్రత్తలతో దీనిని కనిపెట్టవచ్చు. అసలైన పనీర్ చేత్తో నలిపితే మెత్తగా ఉండి ముక్కలైపోతుంది, కానీ కల్తీ పనీర్ రబ్బరులా సాగుతుంది. అలాగే, కొద్దిగా పనీర్‌ను నీళ్లలో మరిగించి, చల్లార్చిన తర్వాత అయోడిన్ లేదా బెటాడిన్ ద్రావణం కలిపితే అది నీలం రంగులోకి మారితే అందులో స్టార్చ్ (పిండి పదార్థం) కలిపినట్లు నిర్ధారించుకోవచ్చు.పాల ఉత్పత్తులే కాకుండా ఇటీవల హైదరాబాద్‌లో కల్తీ నూనె, కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్ మరియు కుళ్ళిన కూరగాయలతో తయారు చేస్తున్న పచ్చళ్ల తయారీ కేంద్రాలు కూడా పట్టుబడ్డాయి. గచ్చిబౌలి, మైలార్‌దేవ్‌పల్లి వంటి ప్రాంతాల్లో జరిగిన దాడులే ఇందుకు నిదర్శనం. రసాయన రంగులు, గడువు ముగిసిన ముడి పదార్థాలను వాడుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఇలాంటి కేంద్రాలు ఎక్కువగా నివాస ప్రాంతాల మధ్యే కొనసాగుతుండటం గమనార్హం. కేవలం తక్కువ ధరకు వస్తున్నాయని నాణ్యత లేని వస్తువులను కొనుగోలు చేయడం వల్ల మన ఆరోగ్యాన్ని మనమే ప్రమాదంలో పడేసుకున్న వారమవుతాము. ఆహార భద్రతా విభాగంలో సిబ్బంది కొరత మరియు ల్యాబొరేటరీల కొరత కల్తీ రాయుళ్లకు వరంగా మారుతోంది. తెలంగాణ వ్యాప్తంగా కేవలం ఒక్క నాచారం ల్యాబ్‌పైనే ఆధారపడటం వల్ల శాంపిల్స్ రిపోర్టులు రావడానికి వారాల సమయం పడుతోంది. ఒక్కో జిల్లాకు ఒకే ఒక ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ ఉండటం వల్ల నిరంతర నిఘా సాధ్యం కావడం లేదు. ప్రభుత్వం వెంటనే స్పందించి జిల్లాల వారీగా మొబైల్ టెస్టింగ్ ల్యాబ్‌లను అందుబాటులోకి తీసుకురావాలి. అప్పుడే తక్షణమే నాణ్యతను పరీక్షించి కల్తీ కేంద్రాలను సీజ్ చేసే అవకాశం ఉంటుంది. అలాగే నేరస్తులపై కఠినమైన నాన్-బెయిలబుల్ కేసులు నమోదు చేయాలి.కేవలం అధికారుల దాడులతోనే ఈ సమస్య పరిష్కారం కాదు, ప్రజల్లో కూడా చైతన్యం రావాలి. మనం కొనే ప్రతి వస్తువుపై ఎఫ్ఎస్ఎస్ఏఐ లోగో, తయారీ తేదీ, గడువు తేదీ ఉన్నాయో లేదో తప్పక పరిశీలించాలి. విడిగా విక్రయించే పనీర్ లేదా నెయ్యి పట్ల మరింత జాగ్రత్తగా ఉండాలి. ఏదైనా హోటల్ లేదా దుకాణంలో నాణ్యత లేని ఆహారం విక్రయిస్తున్నట్లు అనుమానం వస్తే వెంటనే టోల్ ఫ్రీ నంబర్లకు ఫిర్యాదు చేయాలి. వినియోగదారులు ప్రశ్నించడం మొదలుపెట్టినప్పుడే వ్యాపారస్తులలో జవాబుదారీతనం పెరుగుతుంది.వ్యాపారస్తులు కూడా కేవలం లాభమే పరమావధిగా కాకుండా సామాజిక బాధ్యతను గుర్తించాలి. తాము విక్రయించే ఆహారం మరొకరి ప్రాణానికి హాని కలిగిస్తుందని తెలిసి కూడా కల్తీకి పాల్పడటం నేరం మాత్రమే కాదు, అది అమానుషం. హోటల్ యజమానులు మరియు కేటరర్లు తమ ముడి పదార్థాలను నమ్మకమైన డీలర్ల వద్ద నుండే తీసుకోవాలి. ఆహార తయారీ కేంద్రాల్లో పరిశుభ్రతకు పెద్దపీట వేయాలి. పండుగల వేళ తాత్కాలికంగా పెట్టే స్టాల్స్‌పై అధికారులు నిరంతరం నిఘా ఉంచడం ద్వారా భారీ స్థాయిలో జరిగే కల్తీని అరికట్టవచ్చు. ముగింపుగా, ఆరోగ్యమే మహాభాగ్యం అన్న సూక్తిని మనం ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలి. కల్తీ లేని ఆహారం పొందడం ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు. ప్రభుత్వం, అధికారులు మరియు ప్రజలు సమన్వయంతో పనిచేసినప్పుడే ఈ కల్తీ మహమ్మారిని తరిమికొట్టడం సాధ్యమవుతుంది. పండుగ సంబరాల్లో మునిగిపోయి ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయవద్దు. ఈ ఉగాది వేళ ప్రతి ఒక్కరూ నాణ్యమైన ఆహారానికే ప్రాధాన్యత ఇస్తామని సంకల్పించుకుందాం. కల్తీ లేని సమాజాన్ని నిర్మించడంలో మన వంతు బాధ్యతను నిర్వహిద్దాం.

## తెలంగాణలో మరోసారి భారీ వర్షాల హెచ్చరిక... రైతులకు మళ్లీ ముప్పు



**●ఉపరితల ద్రోణి ప్రభావంతో మూడు రోజులు వర్షాలు**
**●ఉరుములు, వడగండ్ల వానలకు అప్రమత్తం కావాలంటూ హెచ్చరిక**
**●ఇప్పటికే పంటలకు భారీ నష్టం రైతుల్లో ఆందోళన**

హైదరాబాద్, మార్చి 19 (మనప్రజాప్రతినిధి): తెలంగాణ రాష్ట్రంలో అకాల వర్షాలతో ఇప్పటికే నష్టపోయిన రైతులకు వాతావరణ శాఖ మరో హెచ్చరిక జారీ చేసింది. రాబోయే రెండు నుంచి మూడు రోజుల పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ఉపరితల ద్రోణి ప్రభావంతో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో పాటు కొన్నిచోట్ల వడగండ్ల వానలు పడే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని దాదాపు అన్ని జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇప్పటికే మంగళ, బుధవారాల్లో కురిసిన అకాల వర్షాలు రైతులను తీవ్రంగా దెబ్బతీశాయి. ముఖ్యంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో భారీ వర్షపాతం నమోదైంది. ఆదిలాబాద్‌లో 8.7 మిల్లీమీటర్లు, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 16.1 మిల్లీమీటర్లు, మంచిర్యాల జిల్లాలో 9.6 మిల్లీమీటర్లు, నిర్మల్ జిల్లాలో స్వల్ప వర్షపాతం నమోదైంది. ఈ వర్షాల కారణంగా పత్తి, పుచ్చకాయ, మామిడి, జొన్న, బొప్పాయి, వరి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. రైతులు ఆరబెట్టిన పెసర, పసుపు పంటలు కూడా తడిసిపోవడంతో నష్టం మరింత పెరిగింది.కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో అకాల వర్షాలు మరింత నష్టం కలిగించాయి. వీణవంక మండలంలో 260 ఎకరాల్లో మక్క పంట నేలకొరిగింది. శంకరపట్నం మండలం రాజాపూర్ గ్రామంలో పిడుగు పడి కొబ్బరి చెట్టు దగ్ధమైంది. కరీంనగర్ రూరల్ మండలంలో 20 ఎకరాల్లో మక్క పంట దెబ్బతింది. పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలంలో సుమారు 500 ఎకరాల్లో మక్క పంట నేలకొరిగినట్లు సమాచారం. ఉమ్మడి నిజామాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో కూడా పంటలకు నష్టం వాటిల్లింది. కొందుర్గు మండలంలో మక్కజొన్న పంట దెబ్బతింది. ఖమ్మం జిల్లాలోని మధిర, ఎర్రుపాలెం, బోనకల్లు, చింతకాని మండలాల్లో చేతికొచ్చిన మక్క నేలవాలింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలంలో రైతులు ఆరబెట్టిన మక్కజొన్న, మిర్చి తడిసిపోయింది.ఈ పరిస్థితులపై వ్యవసాయ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అకాల వర్షాలు కొనసాగితే పంటలకు మరింత నష్టం వాటిల్లే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, వాతావరణ సమాచారాన్ని నిరంతరం పరిశీలించాలని సూచిస్తున్నారు. ప్రభుత్వం కూడా పరిస్థితిని సమీక్షిస్తూ, రైతులకు అవసరమైన సహాయం అందించే చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

## 'తెలంగాణ ప్రజా జాగృతి'పై స్పష్టతకు దారి...

**-కవిత పిటిషన్‌పై హైకోర్టు కీలక ఆదేశాలు**
**-పార్టీ రిజిస్ట్రేషన్‌పై ఈసీకి తక్షణ నిర్ణయ సూచన**
**-సాంకేతిక లోపాలు సరిచేసినట్లు కవిత తరపు వాదనలు**
**-ఉగాది నాటికి పార్టీ ప్రకటనపై ఆశలు పెరుగుతున్నాయి**



న్యూఢిల్లీ, మార్చి 19 (మన ప్రజాప్రతినిధి): తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రతిపాదించిన కొత్త రాజకీయ పార్టీ 'తెలంగాణ ప్రజా జాగృతి' రిజిస్ట్రేషన్ అంశం కీలక మలుపు తిరిగింది. ఈ వ్యవహారంలో జాప్యం జరుగుతుందన్న ఆందోళనల నేపథ్యంలో ఢిల్లీ హైకోర్టు జోక్యం చేసుకుని, కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. దీంతో ఈ రాజకీయ పరిణామం రాష్ట్ర రాజకీయాల్లో

2

## మల్లన్నసాగర్ ప్రధాన కాలువకు గండ రైతుల్లో ఆందోళన

**-చెల్లాపూర్ సమీపంలో కాలువ దెబ్బతింత**
**-నీరు వృథాగా చెరువులోకి చేరుతున్న పరిస్థితి**
**-త్వరిత మరమ్మతులకు రైతుల డిమాండ్**

సిద్దిపేట, మార్చి 19 (మనప్రజాప్రతినిధి): సిద్దిపేట జిల్లాలోని మల్లన్నసాగర్ ప్రధాన కాలువకు గండిపడటంతో రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని చెల్లాపూర్ గ్రామ సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. మల్లన్నసాగర్ నుంచి దుబ్బాక ప్రాంతానికి నీరు సరఫరా చేసే ఈ కాలువ దెబ్బతినడంతో నీటి ప్రవాహం అంతరాయం కలిగింది. కాలువకు గండిపడటంతో



నీరు వృథాగా చెల్లాపూర్ కందూరు చెరువులోకి వెళ్లిపోతోంది. దీంతో కాలువ కింద ఉన్న పంటలకు నీటి కొరత ఏర్పడే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే సాగులో ఉన్న పంటలు ఎండిపోయే పరిస్థితి వస్తుందేమోనన్న భయం రైతుల్లో నెలకొంది.ఈ ఘటనపై స్పందించిన నీటిపారుదల శాఖ అధికారులు గండిపడిన ప్రాంతాన్ని పరిశీలించారు. కాలువ లైనింగ్ పనుల్లో నాణ్యత లోపించడమే ఈ సమస్యకు కారణమని రైతులు ఆరోపిస్తున్నారు. పనుల్లో నిర్లక్ష్యం కారణంగా ఇలాంటి పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులను కలిసిన రైతులు వెంటనే మరమ్మతులు చేపట్టి నీటి సరఫరాను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. దీనిపై అధికారులు స్పందిస్తూ, సాధ్యమైనంత త్వరగా గండిని పూడ్చి నీటి ప్రవాహాన్ని పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. సమస్యను అత్యవసరంగా పరిష్కరించి రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## రవీంద్రభారతిలో ఘనంగా ఉగాది వేడుకలు... పంచాంగ ఆవిష్కరణ

**-సీఎం, ఉప ముఖ్యమంత్రి సమక్షంలో వేడుకలు**
**-వేదపండితుల చేత పంచాంగ పఠనం**
**-సంస్కృతి, సంప్రదాయాల ప్రతిబింబంగా ఉత్సవాలు**

హైదరాబాద్, మార్చి 19 (మనప్రజాప్రతినిధి): తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, దేవాదాయ ధర్మాదాయ శాఖల ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో శ్రీ పరాభవ నామ ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు పాల్గొని వేడుకలను ఆనందంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉగాది పంచాంగాన్ని ఆవిష్కరించారు. కొత్త సంవత్సరానికి సంబంధించిన గ్రహగతులు, ఫలితాలపై వివరాలను అందించేందుకు వేదపండితులు పంచాంగ పఠనం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రముఖ వేదపండితుడు బాచంపల్లి సంతోష్ కుమార్ పంచాంగాన్ని పఠించి, నూతన సంవత్సర ఫలితాలను వివరించారు. ఉగాది పండుగ తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. కొత్త ఆశలు, లక్ష్యాలతో ముందుకు సాగేందుకు ఈ పండుగ ప్రేరణనిస్తుందని అన్నారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులతో, సిరిసంపదలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.ఈ వేడుకలు రాష్ట్ర సంస్కృతి వైభవాన్ని ప్రతిబింబించేలా నిర్వహించబడినట్లు అధికారులు తెలిపారు. ప్రజల్లో ఆధ్యాత్మిక చైతన్యం పెంపొందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఇలాంటి కార్యక్రమాలను కొనసాగిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



## భద్రాచలం బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

**+సీఎం రేవంత్ రెడ్డికి ప్రత్యేక ఆహ్వాన పత్రిక**
**+శ్రీరామనవమి వేడుకలు వైభవంగా నిర్వహణ**
**+మార్చి 27న తిరుకళ్యాణ మహోత్సవం**
**+భక్తులు భారీగా పాల్గొనాలని పిలుపు**

2

# 'తెలంగాణ ప్రజా జాగృతి'పై స్పష్టతకు దారి...

మెదటి పేజీ తరువాయి



ఆసక్తికరంగా మారింది. తెలుగు సంవత్సరాది ఉగాది రోజున కొత్త పార్టీని అధికారికంగా ప్రకటించాలని కవిత ముందుగా నిర్ణయించుకున్నట్లు సమాచారం. అయితే, ఈసీ వద్ద రిజిస్ట్రేషన్ ప్రక్రియలో జాప్యం ఏర్పడటంతో ఆ ప్రణాళికకు అడ్డంకులు ఎదురయ్యాయి. ఈ ఏడాది జనవరిలోనే కవిత పార్టీ రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ, నిర్ణయం వెలువడకపోవడంతో ఆమె న్యాయపరంగా ముందడుగు వేసి ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. తన దరఖాస్తు నిరవధికంగా పెండింగ్‌లో ఉండటం అన్యాయమని పిటిషన్‌లో పేర్కొన్నారు. విచారణ సందర్భంగా ఎన్నికల సంఘం తరఫు న్యాయవాదులు, కవిత సమర్పించిన దరఖాస్తులో కొన్ని సాంకేతిక లోపాలు ఉన్నాయని కోర్టుకు వివరించారు. అయితే, ఆ లోపాలను పూర్తిగా సరిచేసి తిరిగి దరఖాస్తు సమర్పించినట్లు కవిత తరఫు న్యాయవాదులు స్పష్టం చేశారు. అన్ని నిబంధనలకు అనుగుణంగా అవసరమైన పత్రాలు సమర్పించామని, ఇకపై ఆలస్యం అవసరం లేదని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ఇరువర్గాల వాదనలు పరిశీలించిన ఢిల్లీ హైకోర్టు, 'తెలంగాణ ప్రజా జాగృతి' పార్టీ రిజిస్ట్రేషన్‌పై వీలైనంత త్వరగా నిర్ణయం తీసుకోవాలని ఈసీకి స్పష్టమైన సూచనలు జారీ చేసింది. ఈ అంశంపై ఎన్నికల సంఘం కూడా సానుకూలంగా స్పందిస్తూ త్వరిత నిర్ణయానికి అంగీకరించడంతో కోర్టు విచారణను ముగించింది. దీంతో కవిత రాజకీయ భవిష్యత్తుపై ఉన్న అనిశ్చితి కొంతవరకు తొలగినట్లు భావిస్తున్నారు. ఈ పరిణామం తెలంగాణ రాజకీయాల్లో కొత్త చర్చలకు దారితీసింది. ఇప్పటికే రాష్ట్ర రాజకీయాల్లో విభిన్న శక్తుల మధ్య పోటీ కొనసాగుతున్న సమయంలో, 'తెలంగాణ ప్రజా జాగృతి' పార్టీ ప్రవేశం రాజకీయ సమీకరణాలను ప్రభావితం చేసే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా యువత, మహిళలు, సామాజిక వర్గాలపై ఈ పార్టీ ప్రభావం ఎలా ఉండబోతుందన్నదానిపై ఆసక్తి నెలకొంది. ఉగాది రోజున పార్టీ ప్రకటించాలని కవిత ముందుగా సంకల్పించిన నేపథ్యంలో, ఈసీ త్వరగా నిర్ణయం తీసుకుంటే ఆ ప్రణాళిక అమలయ్యే అవకాశాలు ఉన్నాయి. ఇకపోతే, ఈ వ్యవహారం కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయంపై ఆధారపడి ఉండగా, రాబోయే రోజుల్లో ఈ అంశం మరింత రాజకీయ ప్రాధాన్యత సంతరించుకునే అవకాశముంది.

# భద్రాచలం బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

మెదటి పేజీ తరువాయి



భద్రాచలం, మార్చి 19 (మనప్రజాప్రతినిధి): భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానంలో నిర్వహించనున్న శ్రీరామనవమి తిరుకళ్యాణ బ్రహ్మోత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అందజేశారు. మంత్రి కొండా సురేఖతో పాటు ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి ఈ ఆహ్వానాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అందించారు. మార్చి 19 నుంచి ఏప్రిల్ 2 వరకు ఈ బ్రహ్మోత్సవాలు వైభవంగా జరగనున్నాయి. ఇందులో భాగంగా మార్చి 27న శ్రీ సీతారాముల తిరుకళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మహోత్సవానికి ముఖ్యమంత్రిని సాదరంగా ఆహ్వానించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు పాల్గొన్నారు. శ్రీరామనవమి సందర్భంగా జరిగే ఈ బ్రహ్మోత్సవాలు భక్తులకు ప్రత్యేక ఆధ్యాత్మిక అనుభూతిని అందిస్తాయని నిర్వాహకులు తెలిపారు. ప్రతి ఏడాది లక్షలాది మంది భక్తులు ఈ వేడుకలకు హాజరై స్వామివారి కృపాకటాక్షాలను పొందుతుంటారు. ఈసారి కూడా భారీ సంఖ్యలో భక్తులు పాల్గొనాలని కోరారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ, భద్రాచలం దేవస్థానం రాష్ట్రానికి ఆధ్యాత్మిక కేంద్రంగా నిలుస్తోందని పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోందని తెలిపారు. భక్తులందరూ పాల్గొని స్వామివారి ఆశీర్వాదాలు పొందాలని ఆకాంక్షించారు.

# సాదా బైనామా భూములకు శాశ్వత పరిష్కారం

**-ఉగాది వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి కీలక ప్రకటన**
**-రైతు సంక్షేమం, భూసమస్యల పరిష్కారంపై స్పష్టమైన హామీ**
**-రైతు భరోసా, రుణమాఫీతో రైతాంగానికి అండ**
**-వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే దిశగా ప్రభుత్వం కట్టుబాటు**





హైదరాబాద్, మార్చి 19 (మనప్రజాప్రతినిధి): తెలంగాణ రాష్ట్రంలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సాదా బైనామా భూముల సమస్యకు త్వరలోనే శాశ్వత పరిష్కారం చూపించనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉగాది పర్వదినం సందర్భంగా ప్రకటించారు. రవీంద్రభారతిలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన శ్రీ పరాభవ నామ ఉగాది వేడుకల్లో పాల్గొన్న సీఎం, రైతుల సమస్యల పరిష్కారం తమ ప్రభుత్వ అత్యున్నత ప్రాధాన్యమని స్పష్టం చేశారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి రైతును రాజుగా నిలబెట్టడమే తమ సంకల్పమని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి పాల్గొన్న సీఎం, ఉగాది పంచాంగాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రకృతి వైపరీత్యాలు లేకుండా ప్రజలు సుఖశాంతులతో జీవించాలని ప్రార్థించారు. రైతుల కోసం ఈ నెల 22న రైతు భరోసా నిధులను విడుదల చేయనున్నట్లు ప్రకటిస్తూ, వ్యవసాయ రంగానికి మరింత బలాన్ని చేకూర్చే చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రైతాంగం ఎదుర్కొంటున్న భూసంబంధిత సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించిన సీఎం, గతంలో అమలైన ధరణి విధానం వల్ల ఏర్పడిన ఇబ్బందులను గుర్తుచేశారు. రైతులకు భూములపై పూర్తి హక్కులు కల్పించేలా భూ వ్యవస్థలో మార్పులు తీసుకువస్తున్నామని, సాదా బైనామా భూముల సమస్యను సమగ్రంగా పరిష్కరించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామని వెల్లడించారు. రైతులు తమ భూములపై ఎటువంటి అనిశ్చితి లేకుండా సాగు చేసుకునే పరిస్థితిని కల్పించడమే లక్ష్యమని పేర్కొన్నారు. సంక్షోభ పరిస్థితుల్లో ఉన్న రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటోందని సీఎం వివరించారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంతో పాటు బోనస్ కూడా అందిస్తున్నామని తెలిపారు. కేంద్ర గణాంకాల ప్రకారం దేశంలో అత్యల్ప రుణభారం కలిగిన రైతులు తెలంగాణలోనే ఉన్నారని పేర్కొంటూ, ఇది రాష్ట్రానికి గర్వకారణమని చెప్పారు. ఇప్పటివరకు 25 లక్షలకుపైగా రైతు కుటుంబాలకు రూ.20 వేల కోట్లకు పైగా రుణమాఫీ చేసి, వారిని ఆర్థికంగా నిలబెట్టామని వివరించారు. రైతు భరోసా పథకం ద్వారా ప్రతి ఎకరాకు రూ.12 వేల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నామని సీఎం తెలిపారు. ఇప్పటివరకు ఈ పథకం కింద వేల కోట్ల రూపాయలు రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు పేర్కొన్నారు. అదనంగా రైతు బీమా, ఉచిత విద్యుత్, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం వంటి పలు కార్యక్రమాల ద్వారా వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేస్తున్నామని చెప్పారు. రైతులలో విశ్వాసం పెంపొందించడం, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. వ్యవసాయం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు మూలస్థంభమని పేర్కొన్న సీఎం, పరిశ్రమలు, ఐటీ రంగాలు అభివృద్ధి చెందినప్పటికీ రైతుల పాత్ర కీలకమని అన్నారు. రైతులు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని పేర్కొంటూ, సాగునీటి ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేసి ప్రతి ఎకరాకు నీరు అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ చర్యల వల్ల తెలంగాణ దేశవ్యాప్తంగా వ్యవసాయ రంగంలో ఆదర్శంగా నిలుస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ ఉగాది పర్వదినం సందర్భంగా రాష్ట్రంలో వ్యవసాయ రంగం మరింత పురోగమించాలని, పంటలు సమృద్ధిగా పండాలని సీఎం ఆకాంక్షించారు. రైతుల కష్టానికి తగిన ఫలితం దక్కేలా ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. అలాగే ప్రముఖ జ్యోతిష్యులు పంచాంగ శ్రవణం నిర్వహించగా, వివిధ ఆలయాలకు చెందిన అర్చకులను సీఎం సత్కరించారు

# ప్రేమ విరహం తట్టుకోలేక యువతి ఆత్మహత్య పల్నాడులో విషాదం

**-ప్రేమ వివాహానికి పెద్దలు నిరాకరణ తీవ్ర మనస్తాపం**
**-కుమార్తె కోసం తండ్రి ఆవేదన కుటుంబంలో శోకం**
**-కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు**



మాచర్ల, మార్చి 19 (మనప్రజాప్రతినిధి): ప్రేమించిన వ్యక్తి దూరం కావడాన్ని తట్టుకోలేక ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడిన విషాద ఘటన పల్నాడు జిల్లాలో చోటుచేసుకుంది. మాచర్ల పట్టణంలోని యాదవ బజార్‌కు చెందిన చౌడేశ్వరి (21) అనే యువతి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ప్రాణాలు తీసుకుంది. ఈ ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది. చౌడేశ్వరి ఇంటర్ వరకు చదివి ఇంటి వద్దే ఉంటోంది. ఇదే సమయంలో జమ్మలమడకకు చెందిన నాగరాజుతో ఆమెకు ప్రేమ ఏర్పడింది. అయితే, ఈ సంబంధాన్ని కుటుంబ సభ్యులు అంగీకరించరని భావించిన ఈ జంట మార్చి 4న ఇంటి నుంచి వెళ్లిపోయింది. కుమార్తె కనిపించకపోవడంతో తండ్రి చంద్ర శ్రీను పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కానీ, కొంతకాలం పాటు ఆమె ఆచూకీ దొరకకపోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఈ నేపథ్యంలో పోలీస్ స్టేషన్ వద్ద కుమార్తె గురించి సమాచారం అడిగిన తండ్రి ఆవేదనతో ఆత్మహత్యాయత్నం చేయడం ఉద్రిక్తతకు దారితీసింది. పోలీసులు వెంటనే స్పందించి అతని ప్రాణాలను కాపాడారు. అనంతరం పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి చౌడేశ్వరి, నాగరాజు ఉన్నచోటును గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. యువతిని తల్లిదండ్రులకు అప్పగించడంతో పరిస్థితి సర్దుమణిగిందని అందరూ భావించారు. అయితే, ప్రేమించిన వ్యక్తితో వివాహం జరగదన్న ఆవేదనను తట్టుకోలేక చౌడేశ్వరి తీవ్ర మనస్తాపానికి గురైనట్లు తెలుస్తోంది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. కుమార్తెకు మంచి భవిష్యత్తు కల్పించాలనే ఉద్దేశంతోనే ప్రేమ వివాహానికి నిరాకరించామని, కానీ ఆమె ఇంతటి నిర్ణయం తీసుకుంటుందని ఊహించలేదని తండ్రి కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. యువతలో మానసిక ఒత్తిడి, భావోద్వేగ సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో ఇలాంటి ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. కుటుంబ సభ్యులు, స్నేహితులు ఇలాంటి పరిస్థితుల్లో యువతకు మానసిక ధైర్యం కల్పించడం ఎంతో అవసరమని సూచిస్తున్నారు.

# యూరియా యాప్ ను రద్దు చేయాలి



పాలకవీడు : (మనప్రజాప్రతినిధి దినపత్రిక ):ఈ యాసంగి సీజన్లో యూరియా కొరత లేకుండా చూసామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు ప్రకటించడశీ హాస్యాస్పదంగా ఉన్నదని సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యులు ధూళిపాళ ధనుంజయ నాయుడు వ్యాఖ్యానించారు గురువారం నాడు ఆయన సూర్యాపేట జిల్లా పాలకవీడు మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కంబాల శ్రీనివాస్ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు కత్తి శ్రీనివాస్ రెడ్డి మండల సిపిఐ కార్యదర్శి ముళ్ళ జానయ్యతో కలిసి పాత్రికేయులతో మాట్లాడుతూ.... ఒకపక్క గ్యాస్ కొరత లేదు అని కేంద్ర ప్రభుత్వం కామెడీ చేస్తుందని.. మరో పక్క యూరియా కొరత లేదని రాష్ట్ర ప్రభుత్వం కూడా కామెడీ చేస్తుందని వీరిద్దరి కామెడీ చూస్తుంటే జబర్దస్త్ కామెడీ కంటే మరింత ఉత్సాహానిస్తున్నాయని ఎక్కడో ఏసీ గదుల్లో కూర్చుని పరిపాలన కొనసాగిస్తే కాదని క్షేత్రస్థాయిలోకి వచ్చి గ్రామీణ ప్రాంతాల్లో రైతులు మరియు ప్రజలు ఎదుర్కొంటున్న ఈతి బాధలను గమనిస్తే రైతుల ఇబ్బందులు ప్రజల ఇబ్బందులు అవగాహన వస్తాయని ఆయన హితవు పలికారు. రైతు భరోసా వేస్తామని ఒక ఎకరం వరకు వేసి గతంలో రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఎగ్గొట్టిన విషయాన్ని రైతులు ఇంకా మరిచిపోలేదని మళ్లీ అదే సీన్ మళ్లీ రిపీట్ అవుతుందని మొదటి దఫా ఎకరశీ వరకు వేసి రాబోయే రెండు మూడు నెలల్లో వేస్తామని ప్రకటించారని గత ప్రభుత్వం ఒకే దఫా వేసిన విషయాన్ని నేటి పాలకులు గమనంలో ఉంచుకోవాలని ఆయన అన్నారు ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం రైతులపై మరింత పగ పట్టిందని వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించాలని ప్రయత్నం చేస్తున్నదని రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధరను చట్టబద్ధత చేయడం లేదని రైతాంగ వ్యతిరేక విధానాలు అనుసరించిన ఏ ప్రభుత్వశీ కూడా మనుగడ కొనసాగించలేదని చరిత్ర చెబుతున్న సత్యం అని ఆయన అన్నారు

# ఉగాది పర్వదిన శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే



మనప్రజాప్రతినిధి//తిరుమలగిరి: తిరుమలగిరి మండల పట్టణ కేంద్రం స్థానిక శాసనసభ్యులు మందుల సామేలు క్యాంపు ఆఫీసులో పవిత్రమైన ఉగాది పండుగ జరుపుకొని (2026 – శ్రీ పరాభవ నామ సంవత్సరం) మీ జీవితంలో కొత్త ఆశలు, సంతోషం, విజయాన్ని నింపాలని శాసనసభ్యులు మందుల సామేలు కోరుకుంటూ.. మీకు మీ కుటుంబ సభ్యులకు, తుంగతుర్తి నియోజకవర్గం ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలుపుతూ "ఉగాది పచ్చడిలోని షడ్రుచుల్లాగే.. మీ జీవితంలో సంతోషం, దుఃఖం, కోపం, భయం, ఆశ్చర్యం, ప్రేమలు సమపాళ్లలో ఉండి, జీవితం ఆనందమయం కావాలని ఈ కొత్త సంవత్సరం షడ్రుచుల సమ్మేళనంలా, ప్రతీక్షణం నియోజకవర్గ ప్రజలకు ఆనందాన్ని ఇవ్వాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ధరావతు జుమ్కీ లాల్ నాయక్, జిల్లా నాయకులు సుంకరి జనార్ధన్, పట్టణ అధ్యక్షులు పేరాల వీరేష్, నియోజకవర్గ ప్రెస్ క్లబ్ ఇన్చార్జి కందుకూరి లక్ష్మయ్య, కౌన్సిలర్లు బత్తుల శ్రీనివాస్, మల్లయ్య, మూల రాజు, మండల నాయకులు దుప్పల్లి అబ్బాస్, బోండ్ల వంశి, సంత్ సేవాలాల్ మండల కమిటీ అధ్యక్షులు బానోతు రాములు నాయక్, సర్పంచులు కొమ్ము సోమన్న, రాకేష్,నాయకులు పేరాల బాలకృష్ణ, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# విజయవంతమైన ఉపాధి హామీ పరిరక్షణ యాత్ర తలపా దామోదరం రెడ్డి

మనప్రజాప్రతినిధి// శ్రీకాళహస్తి:ఆంధ్రప్రదేశ్ పిసిసి అధ్యక్షురాలు శ్రీమతి వైఎస్ షర్మిలా రెడ్డి గారు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టినటువంటి ఉపాధి హామీ పరిరక్షణ యాత్ర నేటితో విజయవంతంగా ముగిసిందని శ్రీకాళహస్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి తెలిపారు. తలపా దామోదరం రెడ్డి మాట్లాడుతూ ఫిబ్రవరి 2వ తారీఖు నాడు అనంతపురం జిల్లాలో ప్రారంభమైన ఉపాధి హామీ పరిరక్షణ యాత్ర నేటి విశాఖపట్నం జిల్లా నందు ముగిసిందని రాష్ట్రంలో సుమారుగా 29 జిల్లాల్లో 48 సభలు విజయవంతం అయ్యాయని ఉపాధి హామీ పరిరక్షణ యాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని ఉపాధి హామీ కూలీలు కొత్త చట్టం వద్దు పాత చట్టం ముద్దు అని కోరుకుంటున్నారని శ్రీమతి వైఎస్ షర్మిల రెడ్డి గారు ఉక్కు సంకల్పంతో చేపట్టిన యాత్ర వల్ల కొత్త చట్టం మరో రెండు నెలలు వాయిదా పడిందని, ప్రజా సమస్యలపై నేడు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మాత్రమే పోరాడుతుందని రాబోవు రోజులు కాంగ్రెస్ పార్టీవేనని తెలిపారు. ఈ ఉపాధి హామీ పరిరక్షణ యాత్రలో మాజీ కేంద్ర మంత్రులు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, రాష్ట్ర కార్యవర్గం, జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గ సమన్వయకర్తలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ పాల్గొని యాత్రను విజయవంతం చేశారు.

# కల్లూరు మున్సిపల్ ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలియపరచిన పెడగంటి



మన ప్రజా ప్రతినిధి తెలుగు దిన పత్రిక ఖమ్మం జిల్లా కల్లూరు:కల్లూరు మున్సిపల్ 18 వ వార్డు ప్రజలందరపు ఉగాది రాకతో వసంతం మొదలై తరువులు కొత్త చిగురులు తొడుగుతాయని, మన జీవితాల్లోనూ కొత్త ఆశలు,మంచి సంకల్పాలు ప్రారంభం కావాలని కోరుతూ నూతన శ్రీ పరాభవనామ తెలుగు సంవత్సరం 18 వార్డ్ ప్రజలందరి కుటుంబాలలో ఆర్థిక,ఆరోగ్య, సంతోషాలను నింపాలని కోరుతూ ఉగాది పచ్చడిలోని ఆరు రుచులు జీవితంలోని సుఖ-దుఃఖాలు సహా వివిధ అనుభవాలను సూచిస్తాయని వాటిని సమానంగా స్వీకరించాలనే సందేశాన్ని ఇస్తాయన్నారు. పరాభవ అంటే మనలోని అహంకారాన్ని,చెడు ఆలోచనలను ఓడించి విజయానికి పునాది వేసేదన్నారు.తెలుగు ప్రజల సంస్కృతికి, సంప్రదాయాలకు ప్రతీక ఉగాది పర్వదినాన్ని అందరూ సంతోషంగా జరుపుకోవాలని 18 వ వార్డులో ఇంటింటికి తిరుగుతూ మిఠాయిలు పంచుతూ శుభాకాంక్షలు తెలియపరచిన మున్సిపల్ కౌన్సిలర్ పెడగంటి రామకృష్ణ. ఈ కార్యక్రమంలో కల్లూరు మండల బిఆర్ఎస్ నాయకులు పెద్దలు యువత తదితరులు పాల్గొన్నారు.

# భాషాభివృద్ధికి ఇలాంటి కార్యక్రమాలు దోహదం పడుతాయి బాల సాహితీ వేత్త డాక్టర్ వాసరవేణి పర్శరాములు



మన ప్రజాప్రతినిధి మనకొండూరు తేదీ 19 మార్చ్:ఇల్లంతకుంట మండల కేంద్రంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నవీన సాహితి ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది కవి సమ్మేళనం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా వాసరవేణి పరశురాములు మాట్లాడుతూ మన భాషను మనమే అభివృద్ధి చేసుకోవాలని ఆయన సూచించారు. మన జిల్లా సాయుధ పోరాటానికి ముఖ్య భూమక అని ఆయన గుర్తు చేశారు. ఈ జిల్లాలో 200 మంది పీహెచ్డీ చేసిన వారు ఉన్నారని భాషా పరంగా ఇది ఎంతో గౌరవమైనటువంటి విషయమని ఆయన పేర్కొన్నారు. సాయుధ పోరాటంలో ముందుండి పోరు చేసిన బద్దం ఎల్లారెడ్డి జన్మించిన గడప పై నేడు కవి సమ్మేళనం నిర్వహించడం గర్వించదగ్గ విషయం అన్నారు. గ్రామీణ ప్రాంతంలో నవీన సాహితి ప్రారంభించి ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న నవీన సాహితి నిర్వాహకులను ఆయన అభినందించారు. ఈ వొరవడిని ఇలాగే కొనసాగించాలని ఆయన నవీన సాహితి నిర్వాహకులకు సూచించారు. ఈ కవి సమ్మేళనం కార్యక్రమానికి సంధానకర్తగా నవీన సాహితీ వ్యవస్థాపక అధ్యక్షులు మీసాల రాజమౌళి వ్యవహరించగా ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథులుగా ఇల్లంతకుంట ఎస్సై సిరిసిల్ల అశోక్, ఇల్లంతకుంట ఉప సర్పంచ్, గంగాధర క్షేత్ర నిర్వాహకులు మూగు నాగరాజు శర్మ, ఆనందరావు ఫౌండేషన్ అధ్యక్షులు వెంకటేశ్వర్ రావు డాక్టర్ జగన్ మోహన్ రావు, నవీన సాహితీ కార్యదర్శి రణం మల్లేశం మరియు కవులు తప్పెట వోదయ్య, బిల్ల సతీష్ కుమార్, రేగుల బిక్షపతి, ఎం. సుగుణ,వై. శ్రావణి, గైని శ్రీనివాస్ గౌడ్, వొల్లాల మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

# సౌదీపాక్ రక్షణ బంధంలో బీటలు

**-పశ్చిమాసియా సంక్షోభం ప్రభావం**
**-ఎస్ఎండీఏ ఒప్పంద విశ్వసనీయతపై ప్రశ్నలు**
**-సంక్షోభ సమయంలో పాక్ మౌనం చర్చనీయాంశం**
**-ప్రాంతీయ వ్యూహాత్మక సమీకరణాల్లో మార్పుల సూచనలు**



మార్చి 19 (మనప్రజాప్రతినిధి): పశ్చిమాసియాలో కొన సాగుతున్న యుద్ధ ఉద్రిక్తతలు సౌదీ అరేబియాపాకిస్తాన్ మధ్య ఉన్న వ్యూహాత్మక సైనిక రక్షణ ఒప్పందం (ఎస్ఎండీఏ) బలాన్ని ప్రశ్నార్థకం చేస్తున్నాయి. ఒకప్పుడు అత్యంత బలమైన రక్షణ భాగస్వామ్యంగా ప్రచారం పొందిన ఈ బంధం, తాజా పరిణామాల నేపథ్యంలో బీటలు వారినట్లు కనిపిస్తోంది. ఇరాన్, సౌదీ అరేబియా, పాకిస్తాన్ చుట్టూ తిరుగుతున్న ఈ పరిణామాలు ఇస్లామాబాద్ విశ్వసనీయతపై అంతర్జాతీయ స్థాయిలో చర్చకు దారితీసాయి. దక్షిణాఫ్రికాకు చెందిన 'ద స్టార్' మీడియా సంస్థ తన విశ్లేషణలో ఈ అంశాన్ని ప్రస్తావించింది. ఈ ఒప్పందం కుదిరినప్పుడు, బయటి శక్తుల నుంచి ముప్పు ఎదురైతే పరస్పరం సైనికంగా అండగా నిలవాలని ఇరు దేశాలు అంగీకరించాయి. ఒక దేశంపై దాడి జరిగితే, అది ఇద్దరిపై జరిగినట్టే భావించి సంయుక్తంగా స్పందించే విధంగా ఈ ఒప్పందాన్ని రూపొందించారు. దీనివల్ల సౌదీ అరేబియాకు పాకిస్థాన్ నుంచి భద్రతాపరమైన భరోసా లభించిందని అప్పట్లో విశ్లేషకులు పేర్కొన్నారు.అయితే, 2026 ఫిబ్రవరి 28న పరిస్థితులు ఒక్కసారిగా మారిపోయాయి. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సమన్వయంతో దాడులు జరగడంతో ప్రాంతీయ ఉద్రిక్తతలు తీవ్రమయ్యాయి. దీనికి ప్రతీకారంగా ఇరాన్ గల్ఫ్ దేశాలపై దాడులకు దిగింది. ఈ క్లిష్ట సమయంలో ఒప్పందం ప్రకారం పాకిస్థాన్ సైనిక మద్దతు అందించాల్సి ఉన్నప్పటికీ, ఎలాంటి సహాయం అందించకపోవడం సౌదీ వర్గాలను నిరాశకు గురిచేసింది. పాకిస్థాన్ తన దృష్టిని ఆఫ్ఘనిస్థాన్ సరిహద్దు ఉద్రిక్తతలపై కేంద్రీకరించడం ద్వారా సౌదీకి అండగా నిలవకుండా తప్పించుకుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. దేశీయ రాజకీయ ఒత్తిళ్లు, అంతర్జాతీయ వ్యూహాలపై పునరాలోచన కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే, ఇది పాకిస్థాన్ విశ్వసనీయతపై తీవ్రమైన సందేహాలను రేకెత్తిస్తోంది.సంవత్సరాలుగా సౌదీ భద్రతకు అండగా ఉంటామని చెప్పిన పాకిస్థాన్, సంక్షోభ సమయంలో మౌనం పాటించడం ఆ దేశానికి ప్రతిష్ఠా నష్టాన్ని కలిగించే అంశంగా మారింది. ఈ పరిణామాల నేపథ్యంలో సౌదీ అరేబియా తన రక్షణ భాగస్వామ్యాలపై పునరాలోచనలో పడినట్లు తెలుస్తోంది. పశ్చిమ దేశాలతో సహా ఇతర దేశాలతో సంబంధాలను బలోపేతం చేసే దిశగా అడుగులు వేయవచ్చని సూచనలు కనిపిస్తున్నాయి.ఇక ఈ పరిణామం పాకిస్థాన్ దౌత్యపరమైన స్థాయిని కూడా దెబ్బతీసే అవకాశముంది. భవిష్యత్తులో సంక్షోభ పరిస్థితుల్లో పాకిస్థాన్‌పై ఆధారపడవచ్చా అనే ప్రశ్నలు ఇతర దేశాల్లో తలెత్తుతున్నాయి. ఈ పరిస్థితి ప్రాంతీయంగా పాకిస్థాన్ వ్యూహాత్మక ప్రభావాన్ని తగ్గించే ప్రమాదం ఉందని అంతర్జాతీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# పశ్చిమాసియా సంక్షోభం ప్రపంచానికి పరీక్ష

**-ఇంధన భద్రతపై కేంద్రం కసరత్తు**
**-హర్ముజ్ మార్గం కీలకంగా మారిన పరిస్థితి**
**-దౌత్య చర్చలతో సరఫరా సుస్థిరం చేసే ప్రయత్నం**
**-బొగ్గు కేటాయింపులతో దేశీయ అవసరాల భరోసా**




మార్చి 19 (మనప్రజాప్రతినిధి): ఇరాన్, అమెరికాఇజ్రాయెల్ మధ్య కొనసాగుతున్న యుద్ధం నేపథ్యంలో పశ్చిమాసియా పరిణామాలు ప్రపంచానికి కీలక పరీక్షగా మారాయని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. ఈ పరిస్థితులు భారత్‌పై ప్రభావం చూపే అవకాశం ఉన్నప్పటికీ, దేశ ఇంధన అవసరాలు ఎటువంటి అంతరాయం లేకుండా తీర్చేందుకు చర్యలు చేపడుతున్నామని స్పష్టం చేసింది. విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ మీడియాతో మాట్లాడుతూ, పశ్చిమాసియాలోని పరిస్థితులను నిరంతరం పరిశీలిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కువైట్ యువరాజుతో ఫోన్ ద్వారా మాట్లాడినట్లు అధికారులు వెల్లడించారు. ఆయా దేశాలతో పాటు భాగస్వామ్య పక్షాలతో దౌత్యపరమైన చర్చలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఈ చర్చల ఫలితంగా హర్ముజ్ జలసంధి మార్గం ద్వారా రెండు ఎల్పీజీ నౌకలు సురక్షితంగా భారత్‌కు చేరుకున్నాయని వెల్లడించారు. ఇది దేశ ఇంధన భద్రతకు కీలకమైన ముందడుగుగా భావిస్తున్నారు.పశ్చిమాసియా ప్రాంతంలో ఉద్రిక్తతల కారణంగా చమురు, వాయువు సరఫరాపై అనిశ్చితి నెలకొన్నప్పటికీ, ప్రత్యామ్నాయ వనరుల నుంచి దిగుమతులు పెంచే దిశగా కేంద్రం చర్యలు తీసుకుంటోంది. అవసరమైతే మరిన్ని దేశాలతో ఒప్పందాలు కుదుర్చుకుని సరఫరాను నిరంతరంగా కొనసాగించేలా ప్రణాళికలు రూపొందిస్తోంది. ఈ చర్యల ద్వారా దేశంలో ఇంధన కొరత తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపింది. ఇక దేశీయంగా కూడా ఇంధన అవసరాలను తీర్చేందుకు బొగ్గు సరఫరాను పెంచే చర్యలు ప్రారంభమయ్యాయి. చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, ఇతర వినియోగదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రాలకు అధిక పరిమాణంలో బొగ్గును కేటాయించాలని కేంద్రం ఆదేశించింది. కోల్ ఇండియా, సింగరేణి కాలరీస్ సంస్థలకు ఇప్పటికే సూచనలు జారీ చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ చర్యలతో దేశ ఇంధన భద్రత మరింత బలోపేతం అవుతుందని కేంద్రం విశ్వాసం వ్యక్తం చేసింది.

# బ్లూ డ్రమ్ భయండ వివాహేతర సంబంధం కేసులో షాకింగ్ మలుపు

**-భార్య ప్రవర్తనతో భయాందోళనకు గురైన భర్త**
**-ఫేస్‌బుక్ పోస్టులతో బయటపడిన అనుమానాలు**
**-పోలీసుల సమక్షంలో విడిపోవాలని నిర్ణయం**





బులంద్‌షర్, మార్చి 19 (మనప్రజాప్రతినిధి): ఉత్తరప్రదేశ్‌లో ఒక కుటుంబ వివాదం సంచలనంగా మారింది. గతంలో జరిగిన ఒక హత్య కేసు ప్రభావంతో "బ్లూ డ్రమ్, సిమెంట్" అనే పదాలే భయానకంగా మారిన నేపథ్యంలో, ఇలాంటి సంకేతాలతో ఒక భర్త తీవ్ర భయాందోళనకు గురయ్యాడు. తన భార్య ప్రవర్తన, సోషల్ మీడియాలో చేసిన పోస్టులు చూసి తన ప్రాణాలకు ముప్పు ఉందని భావించిన ఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. రాజ్‌కుమార్ అనే వ్యక్తి తన భార్యతో కలిసి జీవిస్తున్న సమయంలో ఆమెకు వేరొక వ్యక్తితో సంబంధం ఉన్నట్లు అనుమానించాడు. ఈ విషయంపై తరచూ ఇద్దరి మధ్య గొడవలు జరిగేవి. అయితే, ఆమె తనపై వచ్చిన ఆరోపణలను తిరస్కరిస్తూ ఎటువంటి ఆధారాలున్నాయని ఎదురు ప్రశ్నించేది. ఒక దశలో తన భర్తను, అతడి కుటుంబ సభ్యులను కూడా చంపేస్తానని బెదిరించడం పరిస్థితిని మరింత తీవ్రతరం చేసింది. ఇదే సమయంలో భార్య ఫోన్‌లో మాట్లాడుతున్న సందర్భంలో ఆమె వ్యవహారంపై అనుమానం వచ్చిన భర్త, ఫోన్‌ను పరిశీలించగా ఫేస్‌బుక్‌లో చేసిన కొన్ని పోస్టులు అతడిని షాక్‌కు గురిచేశాయి. "బ్లూ డ్రమ్, సిమెంట్" వంటి పదాలతో హత్యకు సంబంధించిన సంకేతాలు కనిపించడంతో అతనిలో భయం పెరిగింది. గతంలో జరిగిన ఘటనలను గుర్తు చేసుకుని, తనకూ అలాంటి ప్రమాదం ఉండొచ్చని అనుమానించాడు. చివరకు ఈ విషయాన్ని పోలీసులు ముందుకు తీసుకెళ్లగా, వారు ఇద్దరినీ పిలిచి కౌన్సెలింగ్ నిర్వహించారు. భార్య తనకు భర్తతో ఉండటం ఇష్టం లేదని, తన ప్రేమికుడితోనే జీవించాలనుకుంటున్నట్లు స్పష్టం చేసింది. దీంతో ఇద్దరూ పరస్పర అంగీకారంతో విడిపోవాలని నిర్ణయించుకున్నారు. భర్త కూడా పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఆమెను వెళ్లనివ్వడానికి ఒప్పుకున్నాడు

# రామరాజ్య సిద్ధాంతాలతోనే సుసంస్కృత దేశ నిర్మాణ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

**-నైతికత, ధర్మం ఆధారంగా దేశ నిర్మాణం అవసరం**
**-రామరాజ్యం మార్గమే ఆదర్శ సమాజానికి దారి**



అయోధ్య, మార్చి 19 (మనప్రజాప్రతినిధి): అయోధ్య లోని శ్రీ రామ్ జన్మభూమి మందిరంలో నిర్వహించిన శ్రీరామ్ యంత్ర ప్రతిష్ఠ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రామరాజ్య సిద్ధాంతాలను అనుసరించడం ద్వారా నైతికత, ధర్మం ఆధారంగా దేశాన్ని నిర్మించవచ్చని పేర్కొన్నారు. రామరాజ్యం అంటే కేవలం పరిపాలన కాదు, అది ప్రజల సంక్షేమం, సమానత్వం, న్యాయం కలిసిన ఒక ఆదర్శ వ్యవస్థ అని



రాష్ట్రపతి వివరించారు. సమాజంలో ప్రతి వ్యక్తి ధర్మాన్ని పాటిస్తూ, పరస్పర గౌరవంతో జీవించాలనే సందేశాన్ని శ్రీరాముడు అందించారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో పలు ప్రముఖులు, ఆధ్యాత్మిక వేత్తలు పాల్గొన్నారు. ఆలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమాలు భక్తులకు ప్రత్యేక ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించాయి. శ్రీరామ్ యంత్ర ప్రతిష్ఠతో ఆలయానికి మరింత పౌరాణిక, ఆధ్యాత్మిక ప్రాధాన్యం ఏర్పడిందని అధికారులు పేర్కొన్నారు. దేశ అభివృద్ధికి నైతిక విలువలు, ధర్మబద్ధమైన పాలన ఎంతో అవసరమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము స్పష్టం చేశారు. రామరాజ్య మార్గాన్ని అనుసరిస్తేనే సమాజంలో శాంతి, సమృద్ధి నెలకొంటుందని పేర్కొంటూ దేశ ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు.

# లాల్ లక్ష్మీపురంలో పలు కుటుంబాలను పరామర్శించిన శీనన్న..



## వానరాశి చలమంద గత కొన్ని నెలల నుండి కాలు నడుము భాగంలో ఇబ్బంది ఉండంతో ఆపరేషన్ చేసినా విషయం తెలుసుకొనీ అలాగే శ్రీపాటి ఉషేనమ్మ ను పరామర్శించిన శీనన్న..



మనప్రజాప్రతినిధి//నేరేడుచర్ల: సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ నియోజకవర్గం నేరేడుచర్ల మండలం లాల్ లక్ష్మీపురం గ్రామంలో వాన రాసి చలమంద గత కొన్ని నెలల నుండి కాలునడుము భాగంలో ఇబ్బంది ఉండడంతో ఆపరేషన్ చేసిన విషయం తెలుసుకున్న శీనన్న వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించడం జరిగింది, శీనన్న మాట్లాడుతూ చలమంద కుటుంబాన్ని ప్రభుత్వం, రాజకీయ నాయకులు ఎవరైనా వాళ్లతోచినంత సహాయ సహకారాలు చేసి వారిని ఆదుకోవాలి వాళ్లు నిరుపేద కుటుంబం ఆపరేషన్ కి మూడు లక్షల కు పైగా ఖర్చు కావడం జరిగింది అని వారు అన్నారు అలాగే శ్రీపాటి వెంకన్న భార్య హుస్సేన్ అమ్మ గత కొన్ని నెలల నుండి ఒంట్లో బాగుండడం లేదు వారి విషయం కూడా తెలుసుకొని ఇంటికి వెళ్లి వాళ్ల కుటుంబ సభ్యులతో మాట్లాడిన శీనన్న వారు మాట్లాడుతూ వాళ్ల కుటుంబాన్ని కూడా ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకొని వాళ్లకు ఇందిరమ్మ ఇల్లు వచ్చే విధంగా చూడాలని వారు అన్నారు.. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు గంజాయి వెంకన్న, పర్వతం ఇస్తారి, గోడ్డేటి గురువయ్య యాదవ్, శ్రీపాటి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ చైర్మన్ ని కలిసిన ప్రజాప్రతినిధి పత్రిక చైర్మన్ శ్రీనివాస్



## ఇటీవల నూతనంగా ఎన్నికైన నేరేడుచర్ల మున్సిపల్ చైర్మన్ చిన్న వెంకటరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన ప్రజాప్రతినిధి పత్రిక చైర్మన్ శ్రీనివాస్



మనప్రజాప్రతినిధి//నేరేడుచర్ల:సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ నియోజకవర్గం నేరేడుచర్ల మున్సిపల్ చైర్మన్ చిన్న వెంకటరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి లాల్ క్ష్మీపురం గ్రామ అభివృద్ధికి మీ సహాయ సహకారాలు ఉండాలని పలు అభివృద్ధి పనుల గురించి మాట్లాడటం జరిగింది ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు మార్కెట్ వైస్ చైర్మన్ తాళ్ల సురేష్ రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ మచ్చ శీను, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, అజయ్, మాలాద్రి తదితరులు పాల్గొన్నారు

# ఎల్పీజీపై భయాలకు చెక్ కేంద్రం కీలక ప్రకటన

## -దేశంలో గ్యాస్ కొరత లేదని భరోసా
## మధ్యప్రాచ్య సంక్షోభం మధ్య ప్రత్యామ్నాయ దిగుమతులు
## -బ్లాక్ మార్కెటింగ్‌పై కఠిన చర్యలు




మార్చి 19 (మనప్రజాప్రతినిధి): ఎల్పీజీ సిలిండర్ల కొరత ఏర్పడుతుందన్న వార్తల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న ఉద్రిక్తతల వల్ల సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నా, దేశంలో ఎక్కడా గ్యాస్ కొరత లేదని వెల్లడించింది. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సిలిండర్ల సరఫరా సాధారణంగానే కొనసాగుతోందని భరోసా ఇచ్చింది. పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ సుజాత శర్మ మాట్లాడుతూ, యుద్ధ పరిస్థితుల ప్రభావంపై కొన్ని అపోహలు ఉన్నప్పటికీ, దేశంలో గ్యాస్ సరఫరా సజావుగా కొనసాగుతోందన్నారు. ప్యానిక్ బుకింగ్‌లు కూడా క్రమంగా తగ్గుతున్నాయని, బుధవారం ఒక్కరోజే సుమారు 57 లక్షల రీఫిల్ బుకింగ్‌లు నమోదయ్యాయని వివరించారు. ముడి చమురు లభ్యత, రిఫైనరీ కార్యకలాపాలు కూడా సాధారణంగానే ఉన్నాయని తెలిపారు. మధ్యప్రాచ్య పరిణామాల దృష్ట్యా భారత్ ఇప్పటికే గల్ఫ్ దేశాలపై ఆధారపడటం తగ్గించుకుందని, అమెరికా, రష్యా, నైజీరియా వంటి దేశాల నుంచి సుమారు 70 శాతం ముడి చమురు దిగుమతి చేసుకుంటోందని ఆమె గుర్తుచేశారు. అవసరమైతే మరిన్ని ప్రత్యామ్నాయ వనరుల నుంచి ఎల్పీజీ దిగుమతులు పెంచే చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఇదిలావుండగా, గ్యాస్ కొరత పేరుతో అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్ జరుగకుండా రాష్ట్రాలకు కఠిన ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు. దేశవ్యాప్తంగా సుమారు 6 వేల దాడులు నిర్వహించగా, ఉత్తరప్రదేశ్‌లో వెయ్యి, మధ్యప్రదేశ్‌లో 2,300 సిలిండర్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మరోవైపు పశ్చిమాసియా జలాల్లో ఉన్న భారత నౌకలు, నావికులు సురక్షితంగా ఉన్నారని అధికారులు స్పష్టం చేశారు.

# ట్రాన్స్‌ఫార్మర్ల టెండర్‌పై హైకోర్టు సీరియస్

## -ప్రమాణాలు లేకపోతే జరిమానా హెచ్చరిక
## -షిర్డీ సాయి సరఫరాపై నాణ్యత పరీక్షలు
## -సీబీఐ విచారణ కోరుతూ పిల్‌పై నోటీసులు
## -ధరల్లో భారీ వ్యత్యాసాలపై కోర్టు దృష్టి




అమరావతి, మార్చి 19 (మనప్రజాప్రతినిధి): రాష్ట్రంలో ట్రాన్స్‌ఫార్మర్ల టెండర్ కేటాయింపు, సరఫరా వ్యవహారంపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్ సంస్థ సరఫరా చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాణాలకు అనుగుణంగా లేకపోతే జరిమానాలు విధిస్తామని స్పష్టంగా హెచ్చరించింది. 2021 నుంచి టెండర్ల కేటాయింపులో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యంపై విచారణ సందర్భంగా కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. ఈ కేసును విచారించిన ధర్మాసనం, ట్రాన్స్‌ఫార్మర్ల నాణ్యతపై బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ నిపుణులతో సమగ్ర పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించింది. సరఫరా చేసిన పరికరాలు నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా లేకపోతే సంబంధిత సంస్థపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. ఇదే సమయంలో ఇంధనశాఖ ముఖ్య కార్యదర్శి, ట్రాన్స్‌కో, ఏపీఎస్పీడీసీఎల్ అధికారులు, షిర్డీ సాయి సంస్థకు కౌంటర్లు దాఖలు చేయాలని నోటీసులు జారీ చేసింది. పిటిషనర్ తరఫున వాదనలు వినిపించిన న్యాయవాది, టెండర్ నిబంధనలు షిర్డీ సాయి సంస్థకు అనుకూలంగా రూపొందించారని ఆరోపించారు. తెలంగాణలో ఇదే ప్రమాణాల ట్రాన్స్‌ఫార్మర్లు రూ.85 వేలకే అందుబాటులో ఉండగా, ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం రూ.1.39 లక్షలకు సరఫరా చేస్తున్నారని తెలిపారు. ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్‌పై సుమారు రూ.55 వేల వరకు అధిక ధర వసూలు చేస్తున్నారని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. అంతేకాకుండా, టెండర్ ప్రకారం 5 స్టార్ రేటింగ్ ట్రాన్స్‌ఫార్మర్లు సరఫరా చేయాల్సి ఉండగా, 3 స్టార్ రేటింగ్ పరికరాలే అందించారని ఆరోపించారు ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ వాదిస్తూ, షిర్డీ సాయి సంస్థ 2022 నుంచి సరఫరా చేస్తోందని, ఇప్పుడే పిల్ దాఖలు చేయడంపై సందేహాలు వ్యక్తం చేశారు. పిటిషనర్ పూర్తి వివరాలు సమర్పించేందుకు కొంత సమయం కావాలని కోరడంతో కోర్టు విచారణను వాయిదా వేసింది. అదే సమయంలో పిటిషనర్ సేవ విరమణ అనంతరం ప్రజాహిత దృష్టితో ఈ పిల్ దాఖలు చేసి ఉండవచ్చని కోర్టు వ్యాఖ్యానించింది. ఈ వ్యవహారం రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారింది. ట్రాన్స్‌ఫార్మర్ల కొనుగోలు, నాణ్యత, ధరల విషయంలో పారదర్శకతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కోర్టు ఆదేశాల మేరకు జరగనున్న నాణ్యత పరీక్షలు, తదుపరి విచారణలో కీలక అంశాలు వెలుగులోకి వచ్చే అవకాశముందని నిపుణులు భావిస్తున్నారు.




# టాల్కం పౌడర్ వాడకం.. లాభాలా? నష్టాలా?

## -చర్మానికి చల్లదనం, చెమట నియంత్రణలో సహాయం
## -అధిక వాడకంతో చర్మ సమస్యలు పెరిగే అవకాశం
## -సురక్షితంగా వాడటం అవసరం



మార్చి 19 (మనప్రజాప్రతినిధి): రోజువారీ జీవితంలో టాల్కం పౌడర్ వినియోగం విస్తృతంగా పెరిగింది. చెమటను తగ్గించడం, చర్మానికి చల్లదనం ఇవ్వడం కోసం చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు చాలామంది దీన్ని ఉపయోగిస్తున్నారు. ముఖ్యంగా వేసవి కాలంలో టాల్కం పౌడర్ వినియోగం మరింత ఎక్కువగా కనిపిస్తోంది. టాల్కం పౌడర్ చర్మంపై తేమను తగ్గించి, చెమటను నియంత్రించడంలో సహాయపడుతుంది. దీని వలన చర్మం పొడిగా, సాఫ్ట్‌గా ఉంటుంది. అలాగే దుర్వాసనను తగ్గించడంలో కూడా ఇది ఉపయోగపడుతుంది. కొన్ని సందర్భాల్లో చర్మం రాపిడి తగ్గించడంలో కూడా టాల్కం పౌడర్ సహకరిస్తుంది. అయితే టాల్కం పౌడర్‌ను అధికంగా లేదా తరచుగా ఉపయోగించడం వల్ల చర్మ రంధ్రాలు మూసుకుపోయే అవకాశం ఉంది. దీని వలన చర్మంపై ముడతలు, అలర్జీలు, ఇన్‌ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఉంటుంది. ముఖ్యంగా చిన్నపిల్లలకు వాడేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి. పౌడర్‌ను నేరుగా ముఖానికి లేదా గాయాలపై వేయకూడదని నిపుణులు సూచిస్తున్నారు. మొత్తంగా టాల్కం పౌడర్ ఉపయోగం పూర్తిగా నిషేధించాల్సిన అవసరం లేకపోయినా, పరిమితంగా మరియు జాగ్రత్తగా వాడటం చాలా ముఖ్యం. సహజమైన ప్రత్యామ్నాయాలు ఉపయోగించడం, చర్మాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన ఫలితాలు పొందవచ్చని నిపుణులు చెబుతున్నారు.